

భానుడి భగ భగ...
40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నిర్మానుష్యంగా మారిన గోదావరిఖని ప్రధాన చౌరస్తా

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతం శనివారం నిప్పుల కొలిమిలా మారింది. రామగుండంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26.4డిగ్రీలుగా నమోదైంది. శుక్రవారం గరిష్ఠ 38.4, కనిష్ఠ 26.0, గురువారం 38.4, 26.7, బుధవారం 37.8, 21.6, మంగళవారం 37.8, 23.6, సోమవారం 39.0, 24.8 నమోదయ్యాయి. కొన్ని రోజులుగా కాస్త చల్లగా ఉన్న వాతావరణం శనివారం ఒకే రోజు రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం 8గంటలకే భానుడు భగభగమంటున్నాడు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ఓదెల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఏఐటియుసి జిల్లా జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ, అకాల వర్షాల భయంతో రైతులు వరి కోతలు పూర్తి చేసుకుంటున్నారని, ఇదే అదనుగా కొందరు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. వరికోతలు ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయడంలో క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషించే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పించి పే స్కేల్ వర్తింప చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈనెల 14 తేదీ నుంచి దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్ణయించారు. ఆ మేరకు ఇటీవల పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.



ఉద్యోగభద్రత లేక ఫీల్డ్ అసిస్టెంట్ల వేతలు

- చాలీచాలని వేతనాలతో ఇక్కట్లు
- రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింప చేస్తామని కాంగ్రెస్ హామీ
- అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పట్టించుకోని ప్రభుత్వం
- రేపటి నుంచి దశల వారీగా నిరసన కార్యక్రమాలు

పెద్దపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకవచ్చింది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం కూలీలు వలస వెళ్ళకుండ ఉండడమే. ఈ పథకంలో ప్రతీ కుటుంబానికి వందరోజుల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. రాష్ట్రంలో 53.09 లక్షల జాబ్ కార్డులను ఉపాధిహామీ కూలీలకు జారీ చేయగా, అందులో కోటి 10 లక్షల 77వేల మంది ఉన్నారు. జిల్లాలో 1,19,000 కార్డులు ఉండగా కూలీలు 2,43,000 మంది ఉన్నారు. క్షేత్ర స్థాయిలో ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారితో పాటు మహిళలు, దివ్యాంగులు ఎక్కువగా ఉన్నారు. వెలుగు ప్రాజెక్టు ద్వారా సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉద్యోగ భద్రత కల్పించారు. అదే తరహాలో తమకు కూడా పే స్కేల్ వర్తింప జేయాలని కోరుతున్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

● ఫీల్డ్ అసిస్టెంట్ల విధులు ఇలా..

ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఏడాదికి సరిపడా ఉపాధి పనులను గుర్తించి జాబు కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పించాలి. పనులు జరిగే చోట ఉదయం, సాయంత్రం ప్రత్యేక యాప్‌లో కూలీల హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రామాల్లోని నర్సరీ లను, ఏడు రకాల రిజిస్టర్లను నిర్వహించాల్సి ఉంటుంది. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇతర పనుల్లో వీరి సేవలను వినియోగించుకుంటారు. గ్రామ పంచా యతీలో కార్యదర్శులకు సహా యంగాఉంటారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల్లో కూడా మీరు భాగస్వాములుగా ఉంటున్నారు.

● అరకొర వేతనం

ఫీల్డ్ అసిస్టెంట్లను మూడు కేటగిరీలుగా విభజించి ప్రభుత్వం వేతనాలు అందజేస్తున్నది. మొదటి కేటగిరీలో నెలకు 10 వేలు, రెండో కేటగిరీలో 11 వేలు, మూడో కేటగిరిలో 9 వేల రూపాయల వేతనం ఇస్తున్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఫీల్డ్

(మిగతా 10వ పేజీలో)

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- పంచాయతీ కార్మికుల డిమాండ్
- ఈనెల 19 నుంచి సమ్మె హెచ్చరిక

10లో

నేడు శ్రీపాదరావు వర్ధంతి



మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి ఆదివారం నియోజకవర్గంలో జరగనుంది. కాటారం మండ లం ధన్వాడ కుగ్రామంలో పుట్టిన శ్రీపాదరావు రాష్ట్ర శాసన సభా స్పీకర్ స్థానాన్ని అలంకరించి ఆ పదవికే వన్నెతెచ్చారు. న్యాయ విద్య చదివిన ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. స్వగ్రామమైన ధన్వాడ సర్పం చ్‌గా రాజకీయ ఆరంగేటం చేసిన శ్రీపాదరావు మహదేవపూర్ బ్లాక్ కాం గ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పొగాకు బోర్డు చైర్మన్‌గా, మంథని ఎల్‌ఎంబీ బ్యాంక్ చైర్మన్‌గా, డీసీసీ, పీసీసీలో అనేక పదవులు నిర్వర్తించారు. 1983, 85, 89 అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీపాదరావు రాష్ట్ర శాసన సభా స్పీకర్‌గా నియమితులై 1994 వరకు కొనసాగారు. మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు (పీపుల్స్‌వార్) నక్సల్స్ 1999 ఏప్రిల్ 12న కాల్చి చంపారు. 1994 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో బీఎస్‌ఎఫ్ కమాండోలను రంగంలోకి దింపింది. వారు చేసిన అకృత్యాలకు నిరసనగా నక్సల్స్ శ్రీపాదరావును హతమార్చారు. శ్రీపాదరావు రాజకీయ వారసుడిగా రంగ ప్రవేశం చేసిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎమ్మెల్యేగా ఐదు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ఐటి, శాసన సభ వ్యవహారాల ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. దుద్దిళ్ళ శ్రీనుబాబు ఆధ్వర్యంలో శ్రీపాద ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాల ద్వారా చేయూతనందిస్తున్నాడు. శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకొని పలు మండలాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి సన్నాహాలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిట్టూరు, పెద్దబొంకూరు, పెద్దకల్వలలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతు దృష్ట్యా ఉదయం 8.30 గంటల నుండి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మండల పశువైద్యాధికారిగా కళ్యాణి

రామగిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల అదనపు పశువైద్య అధికారిగా కళ్యాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన దుర్గాప్రసాద్‌రెడ్డి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్ళగా ఆయన స్థానంలో కళ్యాణి అదనపు బాధ్యతలను అప్పగించారు.

వైభవంగా మహమ్మాయి దేవి జాతర

- తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు, హోమాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

9లో

జై హనుమాన్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

9, 10లో



కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

గోదావరిఖని ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని, బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారం భించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ నినాదంతో అంబేద్కర్ రచించిన రాజ్యాం గాన్ని పరిరక్షించేందుకు ఈ యాత్ర నియోజకవర్గంలో పది రోజులు జరుగుతుందని, 50డివిజన్లతో పాటు మండల కేంద్రాల్లో గడప గడపకు వెళ్లి రాజ్యాంగ ఆవశ్యకతను ప్రజలకు వివరించనున్నట్టు ఆయన చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కేవలం నినాదం కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. విభజించు పాలించు అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళుతుందని, దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపుని చ్చారు. ప్రజల మధ్య మత, రాగ ద్వేషాలను రెచ్చ గొడుతూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గడపగడపకు వెళ్లే ఈ యాత్రలో ప్రజలకు వివరించాలని, అదే విధంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. అనంతరం కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. నాయకులు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, ఉల్లంగుల రమేష్, గట్ల రమేష్, కొప్పుల శంకర్, యుగంధర్, పాతిపెల్లి ఎల్లయ్య, పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించరూ...!

- మంథనిలో విరివిగా కోనోకార్పస్ చెట్ల
- ప్రాణాంతక గాలి పీలుస్తున్న పట్టణ ప్రజలు
- చెట్లను తీసివేయాలని ప్రజల డిమాండ్

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలో విష వాయులను విడుదల చేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే కోనోకార్పస్ చెట్లు మంథని పట్టణంలో విరివిరిగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా చెట్లు కార్బన్‌డయాక్సైడ్‌ను స్వీరి ంచి ఆక్సిజన్ విడుదల చేస్తాయి. దీనికి విరుద్ధంగా కోనోకార్పస్ చెట్లు కార్బన్ డయాక్సై డ్‌ను విడుదల చేసి ఆక్సిజన్‌ను స్వీకరిస్తాయని పరిశోధనల్లో తేలింది. ఈ చెట్ల గాలిని పీల్చడం ద్వారా చర్మ, శ్వాసకోశ, ఇతర వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉంది. ఇలాంటి విషతుల్యమైన గాలిని విడుదల చేసే కోనోకార్పస్ చెట్లను ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నాటడాన్ని నిషేధించారు. నాటిన చెట్లను శాశ్వతంగా తొలగింపునకు శ్రీకారం చుట్టారు. మంథనిలో మాత్రం విచ్చల విడిగా జనావాల మధ్య ఈ చెట్లు ఏళ్ళ తరబడి ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో హరితాహారం లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్, శివారులోని ప్రధాన రహదారికి పక్కన ఈ చెట్లను నాటారు. బొక్కలవాగు కరకట్టకు ఇరువైపుల సింగరేణి సౌజన్యంతో కోనోకార్పస్ చెట్లను పట్టణ జనావాసాలకు అతి సమీపంగా భారీ ఎత్తున నాటించారు. ప్రస్తుతం అవి చెట్లుగా మారాయి. గత ఐదేళ్ళుగా మంథని ప్రజలు వీటి గాలి పీలుస్తూ బతుకుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రజల ఆరోగ్యానికి హానీ చేసే ఈ చెట్లను రాష్ట్రంలో పూర్తిగా తొలగించాలని ఆదేశించినా మంథనిలో అమలుకు నోచుకోవడం లేదు.



బొక్కలవాగు కట్ట పై ఉన్న కోనోకార్పస్ చెట్లు

● జనావాసానికి సమీపంగా విరివిరిగా కోనోకార్పస్ చెట్లు..

నిత్యం వేలాది మంది సంచరించే మంథని-పెద్దపల్లి, మంథని-గోదావరిఖని, మంథని-కాటారంలో రూట్లలోని మున్సిపల్ పరిధిలో, పట్టణంలోని బొక్కలవాగు కరకట్ట సీసీ రోడ్డుకు ఇరువైపులా జనవాసాలకు అతి సమీపంగా విరివిరిగా భారీ చెట్లు దర్శమిస్తున్నాయి. ఐదేళ్ళుగా పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురి చేసే ఈచెట్ల గాలి పీలుస్తున్నారు. పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్‌లాగా ఉన్న బొక్కలవాగు కరకట్ట సీసీ రోడుపై నుంచి నిత్యం పట్టణంలోని అత్యధిక వార్డులకు చెందిన, బోయినిపేట, గంగాపురి, కూచి రాజ్‌పల్లి, దొంతులవాడ ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాది మంది కాలిన డకన, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం, రాత్రి యువకులు, మహిళలు, వృద్ధులు వాకింగ్, జాగిం గ్‌తో పాటు బొక్కలవాగు చెక్‌డ్యాంలో ఈ చెట్ల కింద గంటల తరబడి సేదతీరుతున్నారు. ఓపెన్ జిమ్‌లో సైతం గంటల కొద్ది జనం వ్యాయామం చేస్తూ గడుపుతున్నారు. ఓపెన్ జిమ్ నుంచి బోయినిపేట వరకు దాదాపు 2 కి.మీ మేర కరకట్టకు ఆనుకొని పట్టణంలోని వివిధ ప్రాంతాల జనావాసాలు ఉన్నాయి. శ్రీరాంనగర్ నుంచి కూచిరాజ్‌పల్లి వరకు మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారికి ఇరువైపుల ఈచెట్లు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఏళ్ళ తరబడి వీరంతా కోనోకార్పస్ చెట్టు విడుదల చేసే అనారోగ్యానికి కల్గించే గాలిని పీలుస్తున్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడక ముందే పూర్తి స్థాయిలో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వారంలోగా కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగిస్తాం

- మనోహర్, మున్సిపల్ కమిషనర్, మంథని.



మున్సిపల్ పరిధిలో వారం రోజులుగా కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. వీటి స్థానంలో పూలు, పచ్చదనం, నీడనిచ్చే మొక్కలు, చెట్లను నాటి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉన్న ఈచెట్లను తొలగించాం. బొక్కలవాగు కరకట్టకు ఇరువైపులా శ్రీరాంనగర్-కూచిరాజ్‌పల్లి మధ్య ఉన్న మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తాం. ప్రజల ఆరోగ్యానికి హానీ చేసే ఈచెట్లను పూర్తి స్థాయిలో తొలగించి కోనోకార్పస్ చెట్ల రహితంగా మంథని మున్సిపాలిటీని తీర్చిదిదుతాం.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఉదయం 10,30లకు బస్టాండ్ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే జయంతి వేడుకలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

కక్షగట్టి వేతనాలు నిలిపి వేయించారు
అదనపు కలెక్టర్‌పై మహిళా కార్మికుల ఆరోపణ



కార్మిక నాయకులకు సమస్యలు వివరిస్తున్న మహిళా కార్మికులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఇంట్లో పని చేసేందుకు కార్మికులు రావడం లేదని కక్షగట్టి వేతనాలు నిలిపివేయించారని హార్టికల్చర్ విభాగంలో పని చేసే కార్మికురాలు రూప, మరికొందరు ఆరోపించారు. శనివారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద తమ ఇబ్బందులను కార్మిక నాయకులకు, విలేకరులకు వివరించారు. ఒక కార్మికురాలిని పెద్దపల్లిలోని ఆమె నివాసంలో పని చేయించేందుకు పంపారని, ఉదయం 6గంటలకు విధుల్లోకి వెళితే రాత్రి 11గంటలకు ఇంటికి పంపేవారన్నారు. భోజన వసతులు కూడా కల్పించలేదని, చార్జీలు కూడా ఇచ్చేవారు కాదన్నారు. దీంతో కార్మికురాలు మానేసిందని, చదువుకున్న కార్మికులు వెళ్లాలని అధికారులు, సూపర్‌వైజర్లు ఒత్తిడి తెస్తున్నారన్నారు. తాము వెళ్లమంటే రాజీవ్ రహదారిపై నిచ్చెన ఎక్కి చెట్ల మండలు కొట్టాలని వేధిస్తున్నారన్నారు. మార్కెట్ షిఫ్టు చేస్తున్నామని పోల్స్ వేసేందుకు రెండు మూడు అడుగుల లోతు తవ్విస్తున్నారన్నారు. తమ వేతనాలు నిలిపివేశారని, అడిగేందుకు వెళితే మిమ్మల్ని విధుల్లో నుంచి తొలగిస్తామని కమిషనర్ బెదిరిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పిలిపించి దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లామని, న్యాయం చేస్తామని హామీఇచ్చారన్నారు.

రాత్రి వరకు విధులు: కార్మిక నాయకులు

కమిషనర్‌గా అరుణశ్రీ బాధ్యతలు తీసుకున్న తరువాత అవుట్ సోర్సింగ్ కార్మికులపై నిర్బంధం పెరిగిందని కార్మిక నాయకులు యాకయ్య, మురళీధర్‌రావు ఆరోపించారు. కమిషనర్ సాయంత్రం 4, 5గంటలకు కార్యాలయానికి వచ్చి రాత్రి 10, 11గంటల వరకు అన్నీ విభాగాల ఉద్యోగులు ఉండాలని హుకుం జారీ చేస్తోందన్నారు. ఉదయం 10గంటలకు నుంచి రాత్రి 10గంటలకు వరకు ఉండాల్సి వస్తోందన్నారు. అరుణశ్రీ వైఖరిని మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళతామని వారు పేర్కొన్నారు. డ్రైవర్లు, ఇతర సిబ్బంది వేతనాలకు సంబంధించి రూ.4.6లక్షలు కోత విధించారన్నారు.

కార్మికుల ఆరోపణలు అర్థరహితం : కమిషనర్ అరుణశ్రీ

హార్టికల్చర్ విభాగం సూపర్‌వైజర్, కొందరు కార్మికుల పని తీరు సంతృప్తికరంగా లేదు. వారిలో కొందరిని పారిశుధ్య విభాగంలో వాడుకుందామనుకున్నాం. శుక్రవారమే వారి వేతనాలకు అప్రూవల్ ఇచ్చాం. వారు ఎవరో కూడా నాకు తెలియదు. నేను ఇంట్లో పని చేయించుకునేందుకు ఒత్తిడి తెచ్చానన్నది అర్థరహితం.

జమ్మికుంట బస్సును పునఃప్రారంభిస్తాం

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంథని నుంచి ఓడేడ్ మీదుగా జమ్మికుంటకు బస్సు సర్వీస్‌ను తిరిగి ప్రారంభిస్తామని మంథని ఆర్టీసీ డీఎం శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఓ ప్రయాణికుడు జమ్మికుంట బస్సును తిరిగి ప్రారంభించాలని కోరారు. కరీంనగర్ నుంచి రాత్రి 10:30 గంటలకు పల్లె బస్సు నడపాలని, పెద్దపల్లి నుంచి ఉదయం 9 గంటల తర్వాత ట్రైన్ టైమింగ్స్‌కు బస్సు నడపాలని, మంథని నుంచి వేములవాడ వయా పెద్దపల్లి, జూలపల్లి, చొప్పదండి మీదుగా నడపాలని కోరగా అధికారుల దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకుంటామని డీఎం పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

కమాన్‌పూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలు ఢీకొని మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గాం ఛలో-బస్తీ ఛలోలో భాగంగా ఆయన పర్యటించారు. బైక్‌ర్యాలీ నిర్వహించి అంగన్వాడీ సెంటర్‌ను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తాచాటాలన్నారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణాలో నిరుద్యోగ సమస్యతోపాటు ప్రతీ సమస్యను తీరుస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇసుక, నల్లమట్టి అక్రమరవాణా జరిగిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడన్నారు. మండలశాఖ అధ్యక్షుడు కొయ్యడ సతీష్, మట్ట శంకర్, దండె లక్ష్మీనారాయణ, మత్స్యగిరి రాము, జంగేపల్లి మొండయ్య, బర్ల రమేష్, బర్ల సదయ్య, సాగంటి లక్ష్మణస్వామి, కొమ్ము శ్రీనివాస్, పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాలకు జనజీవన స్రవంతిలోకి..

● స్వగ్రామానికి చేరిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు



కాంకేట్ ఎస్పీ నుంచి విడుదల పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల/కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పోరాటంలో నాలుగు దశాబ్దాలుగా వివిధహోదాల్లో పనిచేసి పోలీసుల ఎదుట లొంగిపోయిన మండలంలోని సిరికొండకు చెందిన బత్తుల గాంబాలు అలియాస్ పసుల వసంత శనివారం స్వగ్రామం చేరుకున్నారు. పీపుల్స్ వార్‌లో కోరుట్లకు చెందిన భర్త పసుల రాంరెడ్డితో కలిసి పలురాష్ట్రాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. భర్త రాంరెడ్డి2001లో మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మరణించగా వసంత పార్టీలోనే కొనసాగారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నార్త్ బస్తర్ డివిజన్ ఇన్‌చార్జిగా, ప్రాంతీయ ఆదివాసీ మహిళా సంఘటన్ సీవోగా, కేంద్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగిన వసంత అనారోగ్య కారణాలతో గత ఏడాది సెప్టెంబరులో కాంకేర్ జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయారు. పూర్తిస్థాయిలో కుటుంబసభ్యుల వివరాలు సేకరించిన పోలీసులు శనివారం కుటుంబసభ్యులకు విడుదలపత్రం అందజేస్తూ అప్ప గించారు. కూతురు భవానీ, మేనల్లుడు బత్తుల నరేశ్ కాంకేర్ వెళ్లి వసంతను స్వగ్రామానికి తీసుకువచ్చారు. దాదాపు నలభై సంవత్సరాల తర్వాత ఇంటికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మేనల్లుడు నరేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. పక్కాసమాచారంతో మంథని శివారులోని పోచమ్మగుడి సమీపంలో డబ్బులు పెట్టి పేకాటఆడుతున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇప్పపల్లిలో మహిళ అదృశ్యం



దేవేంద్ర (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లిలో యాగండ్ల దేవేంద్ర(50) అనే మహిళ అదృశ్యమైంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినదేవేంద్ర ఇంటికిరాకపోవడంతో కుటుంబసభ్యులు కలవరపడ్డారు. ఈక్రమంలో భర్త భూమయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కొంతకాలంగా దేవేంద్ర కుటుంబం అప్పులబాధతో సతమతమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

'ఐసర్'తో IISER బంగారు భవిష్యత్తు



- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడు విద్యాలయాలు
- ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం
- ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు
- భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాస్త్రవిద్యను ప్రోత్సహించడం, విద్యార్థులను భవి ష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులుగా తీర్చిది ద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఐసర్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఐఐటీకి దీటుగా సైన్స్ విద్యార్థుల కోసం ఐసర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యు కేషనల్ రీసెర్చ్) విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రారంభించింది. ప్రస్తుతం దేశంలో ఏడు విద్యాలయాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలు శాస్త్ర రంగంలో అత్యుత్తమ విద్యను, పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయి. ఇంటర్ తర్వాత ఎంపీసీ విద్యార్థు లకు ఐఐటీలో ప్రవేశాల మాదిరిగా బైపీసీ ఆధ్వర్యంలో ఐసర్‌లో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను చేర్చుకుంటాయి. ప్రస్తుతం ఐసర్‌లో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభమై నేపథ్యంలో ఆ వివరాలు విద్యార్థుల కోసం..



● బీఎస్, ఎంఎస్ డ్యుయల్ డిగ్రీ...

ఐఏటీ (ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్) ద్వారా ఇంటర్ సైన్స్ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా విద్యాల యంలో ప్రవేశం కల్పిస్తారు. బీఎస్, ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఐన్స్ మాస్టర్ ఆఫ్ సైన్స్) ఐదేళ్ల కోర్సును ఆఫర్ చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఫిజిక్స్ మ్యాథ్స్ కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల్లో విద్యా బోధన చేస్తారు. తర్వాత రెండు సంవత్సరాల్లో వి ద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్టులో స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్టు ఉంటుంది.

● ప్రవేశ పరీక్ష...

ఐసర్‌లో ప్రవేశానికి మూడు మార్గాలు ఉం టాయి. కేవీపీవై, ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ చానల్ (ఐఐటీలో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది). ప్రధానంగా ఐసర్ యాప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించి విద్యార్థులను మెరిట్, కేటగిరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో పీసీఎంబీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలజి) సబ్జెక్టులు చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులు. పదో తరగతిలో 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రవేశ పరీక్షలో 60 ప్రశ్నలు ఉండగా ఒక్కో సబ్జెక్ నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి జవాబుకు నాలుగు మార్కులు ఉంటాయి, తప్పు సమాదానికి 1 మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 240 మార్కులకు పరీక్ష ఉంటుంది.

● ముఖ్యమైన తేదీలు

- విద్యార్థులు ఐసర్ పోర్టల్‌లో ఏప్రిల్ 15 లోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి.
- దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 21, 22న అవకాశం కల్పిస్తారు.
- హాల్‌టికెట్ల విడుదల మే 15
- ప్రవేశ పరీక్ష మే 25న నిర్వహిస్తారు.
- ఐసర్ పోర్టల్: www.iiseradmission.in

● దేశంలో ఏడు విద్యాలయాలు..

దేశంలో ఏడు ఐసర్ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం స్థాపించింది. ఐసర్ పూణే, కలకత్తా, మొహాలీ, భోపాల్, తిరువనంత పురం, తిరుపతి, బరంపురంలో విద్యాలయాలు ఉన్నాయి. దేశంలో మొత్తం 2,363 సీట్లు ఉండగా తిరుపతి ఐసర్‌లో 350 సీట్లు, బరంపురం 300, భోపాల్ 300, తిరువనంతపురం 320, పూణే 288, కలకత్తా 280, మొహాలీలో 270 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా భోపాల్ ఐసర్‌లో బీటెక్ విభాగంలో 140 సీట్లు, ఎకనామిక్స్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఐసర్‌లో టాప్ లెవల్ సైన్స్ విద్యను ఫ్యాకల్టీ అందిస్తుండగా, ఉన్నతస్థాయి ల్యాబ్‌లు, అంతర్జాతీయ సంస్థలు అనుసంధానం, రీసెర్చ్ అవకాశాలను కల్పిస్తున్నాయి. విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తూ అధునాతనమైన హాస్టల్ వసతిని విద్యాసంస్థలు కల్పిస్తున్నాయి.



వంతెనపై భారీ వాహనాలు ఢీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ● సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు



ప్రమాదానికి గురైన భారీ వాహనాలు

కోరుట్లరూరల్ (మెట్‌పల్లిటౌన్), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై రెండు భారీవాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. వంతెనపై భారీ వాహనాలు ఢీకొట్టుకోగా వాహనంలోని క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కున్నాడు. గమనించిన స్థానికులు అతి కష్టంమీద బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్‌ఐలు భారీ వాహనాలను ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటి వరకు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

తొలితరం కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయాం



కాంతారావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్ర సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకుడిని కోల్పోయిందని సీపీఐ జాతీయకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు తానిపర్తి కాంతారావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు నాయకుడని, మంచి ఆదర్శ భావాలున్న వ్యక్తి అని కొనియాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించడం గొప్పవిషయంగా చెప్పుకొచ్చారు. వారిత్యాగాలు, జీవిత విశేషాలు నేటి కమ్యూనిస్టు నాయకులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసి పేద, అట్టడుగువర్గాల సంక్షేమానికి నిరంతరం కృషిచేశారన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కలవేణశంకర్, జిల్లాకార్యదర్శులు తాండ్రసదానందం, మేకలదాస్, జిల్లా ఏఐటీయుసీ ప్రధానకార్యదర్శి కడారి సునీల్, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నాయకులుతానిపర్తిమోహన్ రావు, ఆయన కటుంబసభ్యులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో వణికిపోతున్న అన్నారం గ్రామస్థులు

● రాత్రివేళ గస్తీ తిరుగుతున్న యువకులు

● పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాలు

మానకొండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులు వణికిపోతున్నారు. మార్చి 25న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో చొరబడి నగదు, బంగారు, ఆభరణాలు, మోటార్‌సైకిల్‌ను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 9న అర్ధరాత్రి గ్రామ సమీపంలోని వరాహగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి స్వామివారి హుండీని పగులకొట్టి నగదు అందులోని నగదు, స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 15రోజులలో రెండు వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతనెల 25న ఒకేరోజు గొట్టిముక్కల విజయ, మధునాల వెంకటమ్మ, రుద్రోజు వెంకటాచారి ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, నగలు, పాకాల రాజిరెడ్డి ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లారు. ఇలా వరుస దొంగతనాలతో రాత్రి వేళలో యువకులు కర్రలను పట్టుకొని వీధులలో గస్తీ తిరుగుతున్నారు. ఇప్పటికి 18రోజులైనా దొంగలు పట్టుబడక పోవడం పోలీసులకు సవాలుగా మారింది.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

● కాలిబూడిదైన ధాన్యం, గోనె సంచులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రికర్ల గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు రెండుకోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున ప్రమాదవశాత్తు రైసు మిల్లులో నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు రావడాన్ని అక్కడే ఉన్న కూలీలు గమించి యజమాని గంగారెడ్డితో పాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలార్పి వేశారు. రైసుమిల్లు షెడ్‌తో పాటు సుమారు ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం, 80వేల పాత, 10వేల కొత్త గోనె సంచులు కాలి బూడిదైనట్లు యజయాని తెలిపారు. దీంతో సుమారు రెండు కోట్ల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన చెందారు. రైస్ మిల్లును సివిల్‌సప్లయి అధికారులు, ఆర్‌ఐ ఉమేష్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా విషయమై హత్యాయత్నం కేసులో సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కలికోట పృథ్వి(23), కలికోట రేణుక(39), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పాతూరి సాయికృష్ణ(34), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నక్క వెంకటేశ్(24), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పేయింటర్ సృజన్(21), సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెయింటర్ కనకం నరేశ్(38)లను శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. నిందితుల వద్ద ఒక కత్తి , ఆరు మొబైల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్, ఒక కారును సీజ్‌చేశామని ఆయన తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... కలికోట రేణుక తన మరిది వెంకటేశ్‌కు మధ్య ఇంటి దారి విషయమై గత కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. రేణుక చిన్న కొడుకు పృథ్వి ఎల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి సాయికృష్ణ అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తుం డేవాడు. రేణుక భర్త చనిపోవడంతో కాంట్రాక్టర్ సాయికృష్ణకు రేణుక సాన్నిహిత్యం పెరిగింది. రేణుక తన మరిది వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతుండటంతో వెంకటేశ్‌ను అతని కుటుంబాన్ని పృథ్విచేత చంపించాలని సాయికృష్ణ, రేణుక కలిసి పథకం వేశారు. ఈ పథకంలో భాగంగానే తన మరిదితో దారి విషయం గొడవ ఉందని, ప్రతి రోజు తనను బూతులు తిడుతున్నారని వెంకటేశ్ కుటుంబాన్ని చంపివేస్తే ఇల్లు , స్థలం మనకే వస్తుందని కుమారుడు పృథ్విని పురమాయించారు. ఇందుకు రేణుక, సాయికృష్ణలు కలిసి పృథ్వి తన స్నేహితులైన కనకం నరేశ్, సృజన్, వెంకటేశ్‌లకు మద్యం తాగించి తన బాబాయ్ కుటుంబాన్ని అంతమొందించాలని పథకం ప్రకారం ఈ నెల 8న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి ఆరుగురు నిందితు లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి రాకేశ్(26) అనే వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇతని వద్ద ఒక పెద్ద కత్తి, చిన్న బటన్ చాక్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కూలి చేసుకుంటే జీవించే రాకేశ్ తాగుడుకు బానిసై గతంలో వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. మళ్లీ సిరిసిల్లలో తిరుగుతూ భయానక వాతావరణ సృష్టించాలని కరీంనగర్‌లో పెద్ద కత్తి కొనుగోలుచేసి ద్విచక్రవాహనంలో పెట్టుకొని తిరుగుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● పేలిన వంటగ్యాస్ సిలిండర్



ఇంట్లో నుంచి వస్తున్న పొగలు

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సిరికొండలో సుద్దాల బుచ్చిరాజు అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో శనివారం దగ్ధమైంది. కొన్నేళ్ల క్రితం బిగించిన విద్యుత్‌వైర్లు సరిగా లేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమైంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు లేచిపోయింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతరత్రా సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పక్క ఇంట్లో ఉన్న ఆశా కార్యకర్తకు చెందిన రిజిస్టర్లు కాలిపోయాయి. మరో పక్కన సుద్దాల నరేశ్ అనే కానిస్టేబుల్ ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో నుంచి మంటలు వస్తున్న విషయం గమనించిన స్థానికులు ఆ ఇంట్లో ఉన్న అంధురాలైన వృద్ధురాలిని హుటాహుటిన బయటకు తెచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నష్టానికి సంబంధించిన వివరాలను అంచనా వేశారు.

ఆర్టీసీ బస్సులో యువకుడి అసభ్య ప్రవర్తన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో మద్యం తాగిన ఓ వ్యక్తి యువతులపై అసభ్యంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న సమయంలో మధ్యలో మద్యం సేవించిన ఓ ప్రయాణికుడు ఎక్కాడు. బస్సు తంగళ్లపల్లి మండలం సారంపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో ఆ వ్యక్తి యువతులతో అసభ్యంగా ప్రవర్తించాడు. యువతులు అతన్ని ప్రశ్నించడంతో వారిపై దాడికి యత్నించాడు. దీంతో యువతులు అతనికి దేహశుద్ధి చేశారు. డ్రైవర్ బస్సును నిలిపి నేరెళ్లలో అతన్ని దింపివేశాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఓప్రయాణికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

● పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి బంధువుల ఫిర్యాదు



కమిలిపోయిన విద్యార్థి వీపు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి విద్యార్థిపై ఓ ఉపాధ్యాయుడు ప్రతాపం చూపించాడు. విద్యార్థి వీపుపై బాదడంతో తీవ్రంగా కమిలిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రాథమిక పాఠశాలలో లవన్‌సాయి అనే ఆరేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం తరగతి గదిలో ఉపాధ్యాయుడు దేవరాజు లవన్‌సాయి అల్లరి చేస్తున్నాడని తీవ్రంగా కొట్టాడు. దెబ్బ లకు విద్యార్థి వీపు ఎర్రగా కమిలిపోయింది. సమాచారం అందు కున్న విద్యార్థి బంధువులు పాఠశాలకు చేరుకుని ప్రశ్నించగా అప్పటికే ఉపాధ్యాయుడు దేవరాజు పాఠశాల నుంచి జారుకు న్నాడు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రామచంద్రంపై విద్యార్థి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లవన్‌సాయిని సిరిసిల్ల ఆసుపత్రికి తీసు కెళ్లి చికిత్స అందించారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అందని పరిహారం

● నిలిచిన అప్రోచ్‌రోడ్డు పనులు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలంటున్న మండల ప్రజలు



గుంతలమయమైన మట్టి రోడ్డు


రామడుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామడుగు బ్రిడ్జి నిర్మించిన అధికారులు దానికి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. రామడుగు వాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిస్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఏడుసంవత్సరాలక్రితం సుమారు రూ.8కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు డబ్బులు చెల్లించకపోవడం, తదితర కారణాలతో ఆరు సంవత్సరాలపాటు నత్తనడకన పనులు సాగాయి. దాదాపు 8మంది నిర్వాసితులు ఉండగా వారికి కోటి55లక్షల రూపాయల పరిహారం రావాల్సి ఉందని తెలుస్తోంది. పాతబ్రిడ్జి గత వానలకు పూర్తిగా కూలిపోయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు త్వరలోనే డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో పనులు కొనసాగుటకు రైతులు సహకరించారు. దీంతో బ్రిడ్జినిర్మాణం పూర్తవగా కొద్దినెలలుగా వాహనరాకపోకలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో వానలకు గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం వేసవినేపథ్యంలో దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఒక దశలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు ఇప్పటివరకు డబ్బులు అందకపోవడమే ప్రధానకారణం.

ఓవైపు డబ్బులు రాక రైతులు ఆందోళన చెందుతుండగా మరోవైపు మండల ప్రజలు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు పరిహారం అందితే తప్ప నిర్మాణం జరిగే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రైతులకు పరిహారం ఇప్పించి అప్రోచ్ రోడ్డు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జైన విగ్రహాన్ని కాపాడుకోవాలి

● డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



జైన విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సుమారు 1100ఏళ్లనాటి చరిత్రకు నిదర్శనం పాతబజార్ గౌరీశంకరాలయమని, ఆ ఆలయ ప్రాంగణంలోని జైన విగ్రహంపై రంగులు తొలగించి కాపాడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియాఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక యువ చరిత్ర పరిశోధకుడు కొల్లూరి శివకుమార్ సమాచారంతో శనివారం ఆలయంలో జైన విగ్రహాన్ని పరిశీలించారు. వేములవాడ చాళుక్యుల కాలపు ఈవిగ్రహం24 తీర్థంకరులలో ఒకరైన సుపార్శ్వనాథ్‌గా తెలిపారు. విగ్రహం భూమిలో కూరుకపోయి ఎర్రని రంగు పూయడంతో 1100 సంవత్సరాల చరిత్ర కోల్పోయామన్నారు. ఇప్పటికైనా చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ విగ్రహానికి రంగులు తొలగించి భద్రత కల్పించాలని ఆలయ అధికారులకు, కరీంనగర్ జైన సంఘం బాధ్యులకు విజ్ఞప్తి చేశారు. మరో జైన విగ్రహం ఉండగా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, కొల్లూరి సాయికుమార్, శిల్పి బి సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బోయినపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మల్లాపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. శనివారం మల్లాపూర్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించడంతో వారి వద్ద నుంచి 8,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు రెండు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

దాగుడు మూతలు.. దండాకోర్!



● కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలు
● చిన్నారులకు వేసవిలో ఆటవిడుపు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చనైన పల్లె సీమల్లో మట్టి పరిమళాల మధ్య సంప్రదాయ గ్రామీణ క్రీడల్లో శారీరక ఆరోగ్యం పెంపొందించుకున్న కాలం నుంచి స్మార్ట్ ఆటల యుగం నడుస్తోంది. ఈ హైటెక్ ఆటల ముందు ప్రాచీన గ్రామీణ క్రీడలు చిన్నబోతున్నాయి. నిజానికి వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు. సెలవుల్లో పిల్లలకు వేసవి శిబిరాలు లేకపోతే ఇంట్లో టీవీ, వీడియో గేమ్స్ బయటకొస్తే క్రికెట్.. ఇది మాత్రమే ఇప్పటి పిల్లలకు అలవాటు. ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే గతంలో పల్లెల్లో ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు గుర్తుకు వచ్చి.. ఈనాటి బాల్యం ఎలాంటిదని ఆలోచిస్తే బాధ కలుగకమానదు. శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసాన్ని అందించే గ్రామీణ ఆటలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ వేసవిలో పిల్లలు ఆడుకోదగ్గ ఆనాటి అద్భుతమైన ఆటల్ని మీకు పరిచయం చేయటమే ఈ ప్రయత్నం. ఈ ఆటల్లో సిర్రగొనె, గోలీలాట, దెబ్బలచండీ, అష్టచెమ్మా, కాసెపుల్ల, బొంగరాలాట, కొతికొమ్మ, దస్తాట, పెండలబుర్రి, సీకాట, పావులాట, వీరి వీరి గుమ్మడి పండు, అగ్గిపెట్టెలతో ఫోన్ ఆట, సిగరెట్ పెట్టెలతో పత్తాలాట, రెస్, పాము నిచ్చెన, పుంజీతం, చిత్తు బొత్తు, వంగుడు-దుంకుడు, జంటల్‌టెక్క, ముట్టి చుకునుడు ఇలాంటి ఆటలు అనేక ఉన్నాయి.



● సిర్ర - గోనె

ఈతరం పిల్లలు ఆడుకునే క్రికెట్ ఆటను పోలి ఉంటుంది. సిర్ర - గొనె ఆట. దీన్నే గిల్లి దండా అని కూడా అంటారు. కనీసం ఇద్దరు కలిసి ఆడుకునే ఆట ఇది. ఈ ఆటకు రెండు కర్ర వస్తువులు అవసరం పడతాయి. అవే సిర్ర - గోనె తొలుత బద్దీలో సిర్రను ఉంచి గోనెతో చిమ్ముతారు ఒక్కరు. పైకెగిరిన సిర్రను బుక్క (క్యాచ్) పడితే చిమ్మిన వారు ఔటయినట్లు లేనిచో ఆ సిర్రను బద్దీ వైపు విసురుతారు. అది బద్దీ వద్ద పడకుండా చిమ్మిన వ్యక్తి గోనెతో అడ్డుకుంటాడు. అచ్చం ఆధునిక బ్యాటింగ్ లాగా అడ్డుకోవడంలో విఫలమై ఆ సిర్ర బద్దీకి గోనె కంటే తక్కువ దూరంలో పడితే చిమ్మిన వ్యక్తి క్లీన్‌బౌల్డ్ లాగా ఔటయినట్టు లెక్క. ఒక వేళ సఫలమే అయితే సిర్రను గోనెతో కొట్టి పైకి లేపి మళ్లీ బలంగా బ్యాటింగ్ లాగా విసిరి కొడతాడు. దూరాన్ని గోనెతో కొలిచి రన్స్ లాగా స్కోరింగ్ చేసుకుంటారు.

● వీరి వీరి గుమ్మడి పండు..



పిల్లల సమూహం నుంచి ఒకరిని పెబ్బగా ఎన్నుకుంటారు. మిగిలిన వారిని వరుసగా నిలబెట్టి అందులో ఒకరిని దొంగగా భావించి పెబ్బ కళ్లు మూస్తారు. ఎదురుగా ఉన్న పిల్లల నుంచి ఒకరిని సైగ ద్వారా ముందుకు రమ్మని పిలుస్తారు. వారి దిక్కు వేలెత్తి చూపుతూ వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేంటని కళ్లు మూసుకున్న వారిని అడుగుతారు. సరైన పేరు చెప్పగలిగితే ఆ పేరు గల వ్యక్తి దొంగవుతారు. అబద్ధమైతే ముందుకొచ్చిన వారు ముక్కుపై గిచ్చి వెళతారు.



● కాసె పుల్ల

ఇసుకలో కూర్చుని ఇద్దరాడుకునే ఆట ఇది. ఆటగాళ్లలో ఒకరు మూరెడు సైజులో ఇసుక కట్టను చేసి అందులో ఒక కట్టెపుల్లను తెలియకుండా వదిలి పెట్టాలి. తర్వాత ఇంకో క్రీడాకారిణి ఆ పుల్లను ఎక్కడుందో గుర్తు పట్టడానికి ఇసుక కట్టపై ఒక చేతివేళ్లను ఇంకో చేతివేళ్లలో అల్లుకున్నట్లుగా చేసి రెండు చేతులతో మూస్తారు. ఆ పుల్ల ఆ చేతుల కింద ఉన్నట్లుయితే దాచి పెట్టే అవకాశం వస్తుంది. కనుక్కో లేని పక్షంలో ఓడిపోయారని దోసిల్లో ఇసుకను నింపి అందులో పుల్లపెట్టి.. గెలిచిన వారు ఓడిన వారి కళ్లు మూసి ఎక్కడో దూరంగా తెలియని ప్రదేశంలో ఆ ఇసుక కుప్పను పారబోయిస్తారు. యథాస్థానానికి వచ్చిన తర్వాత కళ్లు తెరిపిస్తారు. పారబోసిన ఇసుక కుప్పను కనుక్కోవడం ఆసక్తి కరంగా ఉంటుంది.



● దస్తాట

ఓ డజను మంది పిల్లలు వృత్తాకారంలో తలను నేలకేసి వంచి కూర్చుంటారు. అందులో ఒకరు రుమాలు (దస్తి)ను పట్టుకొని వారి వెనకాల మూడు రౌండ్లు తిరిగి ఒకరి వెనక వేస్తారు. వారు గుర్తించి వెంటనే లేచి దస్తీ పట్టుకొని రౌండ్లు కొట్టి మరొకరి వెనక వేయాల్సి ఉంటుంది. దస్తీ తన వెనకున్న విషయం ఆలస్యమైతే మిగతా పిల్లలు వీపులో పిడికిలి గుద్దులు గుద్దుతారు.



● గోలీలాట.. (లక్కాట)

గోలీలాటలో ఇది ఒక భాగం. ఈ ఆటను ఎంతమందైనా ఆడుకోవచ్చు. ఒకప్పుడు పల్లెటూళ్లలో ఈ ఆటను పిల్లలు బాగా ఆడుకునేవారు. ఈ ఆటతో వారి సృజనాత్మకత కూడా పెరిగేది. వృత్తంలో ఉన్న గోలీలను గురి చూసి కొట్టడం ఈ ఆట ప్రత్యేకత. గురి చూసి కొడితేనె గెలుపు. ఈ ఆట ఇప్పుడు దాదాపు కనుమరుగైంది.



● అష్టాచెమ్మ

కొంచెం అటు ఇటుగా ఈ ఆట పచ్చీసును పోలి ఉంటుంది. నలుగురులోపు ఆటగాళ్లు దీన్ని ఆడతారు. చింతగింజలు, రాళ్లను పావులుగా వాడుకుంటూ గవ్వలతో పందెం కాస్తారు. ఇందులో అష్ట చెమ్మ అనే ప్రధాన పదాలుంటాయి. ఎవరు ముందు పావులతో ఇంటికి చేరితే వారు గెలిచినట్టు.



● కోతి కొమ్మ

వేసవి సెలవుల్లో పిల్లల్ని తోటల వైపు ఆకర్షించి చెట్లపై కోతులుగా మార్చే ఆట ఇది. ఈ ఆటలో పెద్ద పెద్ద కొమ్మలున్న చెట్టును ముందుగా ఎంచుకుంటారు. ఆటకు ముందు ఆడే పిల్లలు చప్పట్లతో ఒకరిని దొంగగా గుర్తిస్తారు. మిగిలిన వారందరూ చెట్టెక్కి కొమ్మల మీద కోతిచేష్టలతో దొంగను ఆటపట్టిస్తుంటారు. దొంగ పిల్లాడు కూడా చెట్టెక్కి ఎవరో ఒకర్ని ముట్టుకుంటే అతడు తర్వాతి ఆటలో దొంగగా రావాల్సిందే. ఆ లోపు ఆటగాళ్లందరూ దొంగకు చిక్కకుండా చెట్టు దిగడమో.. లేదా చెట్టు కింద గీయబడ్డ వృత్తంలో దూకుతారు. అన్నట్టు చిన్నారులూ.. ఆట బాగుంది. కదాని రెచ్చిపోతే చెయ్యి. కాలు విరగ్గొట్టుకోవడం ఖాయం. జరంత జాగ్రత్త.



నృత్యాలు చేస్తూ వస్తున్న దీక్షాపరులు

జై హనుమాన్

● కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి ● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు
● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. భక్తులు శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం శనివారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈవో శ్రీకాంత్‌రావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండగట్టు అంజన్న స్వామిని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు.





కోనేరు వద్ద భక్తజనం

● కొండపైనే కలెక్టర్, ఎస్పీ మకాం..



సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ నిత్యం కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజులుగా భక్తులు అధికంగా వచ్చే సమయంలో కొండపైన కలియతిరుగుతూ అర్ధరాత్రి వరకు కొండపైనే ఉంటూ, భక్తుల వద్దకు వెళుతూ సమస్యలు తెలుసుకొని తగు పరిష్కార సూచనలు ఇచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ, దీక్షా విరమణ, దర్శనాలు తదితరవి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

● అడుగడుగునా ఇబ్బందులు.. భక్తుల అసహనం

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం జరిగిన హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రాగా అడుగడుగున భక్తులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తోడు మరో 366 మందిని అదనంగా ఉత్సవాల కోసం నియమించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడంపై మండిపడ్డారు. అలాగే భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లోనూ సకాలంలో నీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఎండలతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. దీక్షాపరుల మాలవిరమణ సందర్భంగా కొందరు అర్చకులు డబ్బులు వసూలు చేయడం, తలనీలాలు సమర్పించే చోట క్షురకులు డబ్బులు ఇస్తేనే తలనీలాలు తీస్తామంటూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో భక్తిప్రపత్తులతో వస్తే బలవంతంగా వసూలు చేయడమేంటని భక్తులు ఆరోపించారు. స్నానాల కోసం కాంట్రాక్టర్లు రూ.20నుంచి 30వరకు వసూలు చేశారని అంజన్న సన్నిధిలో వ్యాపారులు అధిక ధరలతో తమను నిలువు దోపిడీకి గురి చేశారంటూ కొందరు భక్తులు ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఘాట్‌రోడ్డు పక్కన చలివేంద్రం దుస్థితి

వైభవంగా మహమ్మాయిదేవి జాతర

● తరలివచ్చిన భక్తులు
● ప్రత్యేక పూజలు, హోమాలు



మహమ్మాయి దేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మహమ్మాయి దేవి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మహమ్మాయి అమ్మ వారిని దర్శనం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు వాహనాలను కొంత దూరంలోనే పార్కింగ్ చేయించారు. వారం రోజులుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం జాతర కావడంతో ఉదయంనుంచి భక్తుల తాకిడి మొదలయింది. ఆదివారం తెల్లవారుఝాము వరకు భక్తులు దర్శనం కోసం వస్తుంటారని ఆలయఉత్సవాల నిర్వాహకకమిటీ ప్రతినిధి దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, పూర్ణాహుతి, అమ్మ వారికి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కోసం చలువ పందిళ్లతో పాటు చల్లని నీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు.

నేడు పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర

జూలపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామశివారులో గల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదివారం జరగనుంది. ఆదివారం వేకువజామున రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు గొట్టెముక్కుల రవిందర్‌రెడ్డి, గొట్టెముక్కుల రాజభాస్కర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథోత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.



ముస్తాబైన యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

ఉద్యోగభద్రత లేక ఫీల్డ్‌అసిస్టెంట్ల వెతలు

(7వ పేజీ తరువాయి)

అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా అక్కడి ప్రభుత్వాలు గుర్తించి వేతనాలను అందజేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫీల్డ్ టెక్నికల్ అసిస్టెంట్లుగా గుర్తించి నెలకు 18 వేల రూపాయల వేతనాన్ని అందజేస్తున్నది. తమకు కూడా ఉద్యోగభద్రత కల్పించి పేస్కేల్ వర్తింపచేయాలని కొంతకాలంగా ఆయా ప్రభుత్వాలకు విన్నవిస్తున్నారు. కానీ వారి సమస్యలు నేటికీ తీరలేదు. 18సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకువస్తున్నారు.

ఉపాధి పనుల్లో నిధుల కేటాయింపు

ఉపాధిహామీ పథకానికి కేటాయించిన నిధుల్లో 60 శాతం కూలీలకు, 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద వెచ్చించాలని నిబంధనలు రూపొందించారు. యేటా రాష్ట్రంలో ఉపాధిహామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేస్తున్నారు. కూలీలకు ఎంత ఎక్కువ పనులు కల్పిస్తే మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెరుగుతాయి. 2024-25లో జిల్లాలో 89.35 కోట్ల రూపాయల వేతనాలు కూలీలకు చెల్లించగా, మెటీరియల్ కాంపోనెంట్ కింద 25.58 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, మురికి కాలువలు, అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఏ ప్రభుత్వం కూడా వారికి ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 14వ తేదీ నుంచి దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి పేస్కేల్ వర్తింపచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

భూకంప వదంతులపై అధికారులు వివరణ ఇవ్వాలి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భూకంపం వస్తుందన్న వదంతులపై కలెక్టర్, సింగరేణి ఉన్నతాధికారులు, కార్పొరేషన్ కమిషనర్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని స్వచ్ఛంద, ప్రజా సంఘాల బాధ్యులు కోరారు. శనివారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని స్నేహ సాహితీ గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో పర్యావరణవేత్త ఉమామహేశ్వరరావు, స్నేహసాహితీ గ్రంథాలయం వ్యవస్థాపకుడు ఏలేశ్వరం వెంకటేష్ మాట్లాడారు. భూకంప వదంతులతో పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, బయట ప్రాంతాల్లో ఉండాలనే ఆలోచనకు వస్తున్నారని తెలిపారు. ప్రజల అనుమానాలు, భయాలు పోయేలా స్పష్టత ఇవ్వాలని కోరారు. పిల్లి రాజమౌళి, ప్రకాష్‌రెడ్డి, పోచయ్య, లక్ష్మీనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



పెద్దకల్వలలో చెత్త తీస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా పంచాయతీ కార్మికుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రం చేయడంతోపాటు ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేసి ప్రజలకు దోమలు, ఈగల బెడద లేకుండా రోగాల బారిన పడకుండా చూస్తారు. అలాంటి పారిశుధ్య కార్మికులకు వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ తామే శుభ్రం చేస్తున్నామని, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడ శుభ్రం చేస్తున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రతీ నెల సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీల్లో మల్టిపర్పస్ విధానాన్ని రద్దుతో పాటు జీవో నెంబర్ 51ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 19 తరువాత సమ్మె చేపడుతామని వారు పేర్కొంటున్నారు.

పంచాయతీ కార్మికులు పొద్దంతా కష్టపడ్డ వారికి కనీస వేతనం అమలు చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పంచాయతీ కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం గ్రామంలో ప్రతి 500 జనాభాకు ఒక కార్మికుడిని నియమించింది. వీరికి ప్రతి నెల రూ.9500 చెల్లించగా కార్మికులందరిని ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్స్‌గా గుర్తిస్తూ గ్రామంలో చెత్తను శుభ్రం చేయడం మొదలుకొని చెట్లకు నీళ్లు పోసేవరకు అన్ని సేవలకు వినియోగించుకుంటుంది.

నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

- సంటి శ్రీనివాస్, పంచాయతీ కార్మికుడు



గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26లు చెల్లించాలి. ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు సమయానికి అందిస్తే అప్పులు పాలు కాకుండా ఉంటాం. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన కార్మికులను అదనంగా నియమించాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- నరేష్, సబ్జితం, మండల ప్రధాన కార్యదర్శి



జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలి. దీంతో పాటు పంచాయతీ కార్మికుల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలి.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నారాయణస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి స్వామి, అమ్మవార్ల కల్యాణం తర్వాత లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవాన్ని లోకే కుటుంబ సభ్యులు భక్తులతో కలిసి రథోత్సవం నిర్వహిస్తారు. దాదాపు 70 ఏళ్ళ క్రితం స్వర్గీయ లోకే పెద్దరామన్న రథోత్సవాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి లోకే కుటుంబ సభ్యులు క్రమం తప్పకుండా స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథం పై ఉంచి పురవీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకొన్నారు. రథోత్సవం అనంతరం విగ్రహాలను ఆలయంలోకి చేర్చారు. లోకే రాధాకిషన్‌రావు, లోకే సుధాకర్‌రావు, లోకే మనోహర్‌రావు, లోకే శ్రీధర్‌రావు, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

అంబేద్కర్ ఆశయాలతో ముందుకు పోవాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య పిల్లలకు 3వేల విలువైన నోట్‌బుక్స్ అందజేశారు. వేసవి సెలవుల్లో హోంవర్క్ చేయడానికి పిల్లలకు అందించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని, ఆయన సమానత్వం కోసం పోరాడిన మహనీయుడన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రీప్రైమరీ, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమపిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, శ్రీవాణి, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి బైకని శరణ్య జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. నవంబర్‌లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో ప్రతిభ కనపరచి శరణ్య జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు మణిపూర్ రాష్ట్రంలోని ఇంపాల్లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరుపున శరణ్య ఆడనుంది. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయుల బైకని కొమురయ్య మేకల సంజీవ్, ఉపాధ్యాయుల అభినందించారు.

పీజీ కళాశాలలో క్విజ్, ముగ్గుల పోటీలు



ఖని పీజీ కళాశాలలో రంగోలి పోటీల్లో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతి ఉత్సవాలలో భాగంగా గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్, రంగోలి పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ హాజరై మాట్లాడారు. దేశానికి మహనీయులు అందించిన సేవలను, వారి మార్గనిర్దేశాలను కొనియాడారు. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు అజయ్‌కుమార్, యాదయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, పాల్గొన్నారు.

కల్వచర్లలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాన మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని కులసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోచమ్మకోలుపులో భాగంగా శనివారం భూలక్ష్మి వద్ద పెద్దపట్నం, పోతరాజు ఆటలతో గ్రామస్థులు సంబరాల్లో మునిగితేలారు. గోకుల్‌నగర్‌లోని ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం పట్నంతో సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం నిర్వహించే పోచమ్మ కొలుపునకు పెద్దసంఖ్యలో గ్రామస్థులు హాజరై విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు కోరారు.

బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం కాలనీ పట్టణ నాయకులు గావ్ ఛలో బస్తీ ఛలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 19వ డివిజన్‌లోని లక్ష్మీనరసింహ ఆలయ ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి స్వచ్ఛతా కార్యక్రమం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేవైఎం నాయకుడు చొప్పరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు మూకిరి రాజు, మారెపల్లి శ్రీనివాస్, ఆకుల శశికుమార్, దాసరి శ్రీనివాస్, లింగంనాయక్, పొట్ల వెంకటి, కుమార్, అయిలవేని అనిల్, గంధం శంకర్, బాలయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ శ్రేణులు శనివారం కాలనీలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించాయి. రాజ్యాంగ పరిరక్షణ నినాదం కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని, బీజేపీ విభజించు పాలించు విధానాన్ని అవలంబిస్తోందన్నారు. మతోన్మాదాన్ని ఉసిగొల్పి సామాన్యుల హక్కులను కాలరాస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీన పరచి సొంత రాజ్యాంగానికి వ్యతిరేకంగా సొంత ఎజెండాతో దేశాన్ని అధోగతి పాలుచేస్తున్నట్టు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, తిరుపతి రెడ్డి, చక్రపాణి పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌ను నియమించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మహాకవి పోతనకాలనీలో పర్మినెంట్ ఎలక్ట్రీషియన్‌ను నియమించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం జీఎం, ఏజీఎంలకు వినతిపత్రాన్ని అందజేశారు. కొన్ని నెలలుగా సబ్‌స్టేషన్‌లో ఎలక్ట్రీషియన్ లేక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, 1300 క్వార్టర్‌లు ఉన్న కాలనీలో విద్యుత్ సమస్యలు తలెత్తితే పరి ష్కారం కావడంలో ఆలస్యం అవుతున్నట్టు ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ జీఎం, ఏజీఎంలకు తెలిపారు. దశరథంగౌడ్, మల్లేష్, ఆకుల రాజిరెడ్డి, సమ్మయ్య, గోపాల్‌రావు ఉన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను తొలగించండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల కార్మికులపై నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందును తొలగించాలని టీఆర్‌ఎస్-డీ కార్పొరేషన్ అధ్యక్షుడు నీలం బిక్షపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగరపు శివకృష్ణ కలెక్టర్‌ను కోరారు. చిన్న చిన్న కారణాలు చూపుతూ ఇప్పటి వరకు పది మంది కార్మికులను అకారణంగా తొలగించారని, స్కావెంజర్లు చేసే పనిని స్వీపర్లతో చేయిస్తున్నారని ఆరోపించారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు.

జై శ్రీరాం.. జై హన్మాన్...

- వైభవంగా చిన్న హన్మాన్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదానం





జవహర్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, రూపు నారాయణపేటలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు దంపతులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలు శనివారం గోదావరిఖనిలో ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై శ్రీరామ్...జై హనుమాన్ నామస్మరణలతో మార్మోగాయి. కోదండ రామాలయంలో ఆంజనేయస్వామికి అర్చనలు చేశారు. భరద్వాజనగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తమలపాకులతో ప్రత్యేక అర్చనలు, అన్నదానం నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. గౌతమినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీఎంకాలనీ, మార్కండేయకాలనీ, విఠల్‌నగర్, మారుతీనగర్‌లలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలి

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

హనుమాన్ జయంతి సందర్భంగా గోదావరిఖని పలు ఆలయాలను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం ప్రజలపై ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. భక్తులు హనుమాన్, వైష్ణవ ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీక్షాపరులు భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహాలను ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు నిర్వహించారు. పెంజేరుకట్టలోని హనుమాన్, బలవీర హనుమాన్, రావుల చెరువుకట్ట, తమ్మి చెరువు, వాగుగడ్డ, విశ్వబ్రాహ్మణవీధి, నడివీధిలోని బాలహనుమాన్, శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలోని, గోదావరినదితీరంలోని, ఎరుకలగూడెంలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): చిన్న హన్‌మాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయంలో ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు పారాయణాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు స్వీట్లు పులిహోర అందించారు. పెరికిగిద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో చైర్మన్ ఆకుల రామేశ్వర్ రెడ్డి, అర్చకులు కొండపలుకల అభిలాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లంకి రమేష్ సౌజన్య మన స్విని, మహిత వడ మాల వేసి పూజలు చేశారు. శాస్త్రినగర్, వేణుగోపాలస్వామి, చిన్నకలువల, రామునిపల్లి, కనుకుల, సుద్దాల ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రూపు నారాయణపేటలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తాంజనేయ స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా శివ పంచాయతన నవగ్రహ, అర్చన హోమ బలిహరణ, నవగ్రహ పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఓదెల, కనగర్తి, మడక, కొలనూర్, హరిపురం, గోపరపల్లి,ఉప్పరపల్లి, పొత్కపల్లి, జీలకుంట, హరిపురం, గూడెం, గుంపుల రామభద్ర ఆలయంలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద భక్తులు క్యూ లైన్‌ల ద్వారా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హనుమాన్ మాలధారులు కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు నర్సాపూర్, ముప్పిరితోట, లోకపేట, సుల్తాన్‌పూర్, శివపల్లి, రాములపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి, లాలపల్లి, ధూళికట్ట గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ విగ్రహాలకు సింధూరం, పూలమాలలతో అలంకరించారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాలతోపాటు రామగుండం పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయాల్లో స్వామి వారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు దేవాలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. హిందూ వాహిని అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండల కేంద్రంతోపాటు వడుకాపూర్ వెంకట్రావుపల్లి, పలు గ్రామాల్లో హన్‌మాన్ చిన్న జయంతి వేడుకలను ప్రజలు,హన్‌మాన్ దీక్ష స్వాములు నిర్వహించారు. వడుకాపూర్ శివాలయంలో హన్‌మాన్ జయంతిని పురస్కరించుకుని అదే గ్రామానికి చెందిన గుంత లచ్చయ్య అనే భక్తుడు రూ.25వేలు విరాళం ఇచ్చారు. సాయంత్రం హన్‌మాన్ శోభాయాత్రను నిర్వహించగా ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు.





సుల్తానాబాద్ హన్‌మాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు, ఖనిలో హోమంలో పాల్గొన్న భక్తులు

రాజీవ్ యువ వికాసం

దరఖాస్తు గడువు పొడిగించాలి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తు తేదీని పొడిగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వర్ పని చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని, మరో పది రోజులు గడువు పెంచాలన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువును పొడిగించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ సెంటర్ల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. వరుస సెలవులు, ఆన్‌లైన్ సర్వర్ రోజుల తరబడి పని చేయకపోవడం వలన చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు. వీరి కోసం మరోసారి గడువు పొడగించాలన్నారు. బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్రెంల సురేష్, బాబు రవిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం సింగరేణి స్కూల్ విద్యార్థులకు యాజమాన్యం వ్యాసరచన పోటీలను నిర్వహించింది. అంబేద్కర్ దేశానికి, సమాజానికి చేసిన సేవపై జరిగిన వ్యాస రచన పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎం సుందర్‌రావు, ఉపాధ్యాయులు పోటీల నిర్వహణను పర్యవేక్షించారు.

మోదీతో ఆర్థికాభివృద్ధి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గాం చలో బస్తీచలోలో భాగంగా బీజేపీ ప్రవేశపెట్టిన పథకాల గురించి గ్రామస్థులకు వాడవాడల వివరించారు. అంగన్వాడీ సెంటర్, రేషన్‌షాపులకు వెళ్లి కేంద్రప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం, సన్నబియ్యం గురించి తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలు ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. గూడెపు జనార్దన్‌రెడ్డి, చల్ల చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, ఎండి.రఫీ, పాల్గొన్నారు.

జనగామ శివాలయంలో రుద్రాభిషేకం



శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. శనివారం జనగామ త్రిలింగ రాజరాజేశ్వర ఆలయంలో మహా రుద్రాభిషేకంలో ఎమ్మెల్యే దంపతులు మక్కాన్‌సింగ్, మనాలీ ఠాకూర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనగామలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.6కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశానని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని ఆయన చెప్పారు. రామగుండం ప్రజలకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. ఏడాదిలో రామగుండం రూపురేఖలు మారనున్నట్టు, ఆ భగవంతుడు రామగుండం అభివృద్ధి కోసం మరింత శక్తిని ప్రసాదించాలని కోరారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ రుద్రాభిషేకం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ రుద్రాభిషేకానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.

గుర్తింపు సంఘాల వైఫల్యాలను కార్మికులకు తెలుపాలి



యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్మిక సంఘాల వైఫల్యాలను కార్మిక వర్గానికి తెలియజేసే బాధ్యత కార్యకర్తలదేనని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆర్జీ-2 ఏరియా ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ పదేళ్ళ కాలంలో జాతీయ సంఘాలు పోగొట్టిన హక్కులను సాధించడమే కాకుండా కోల్ ఇండియాలో లేని హక్కులు సాధించినట్టు తెలిపారు. కార్మికుడి తల్లి దండ్రులకు ఉచిత వైద్యం, మహిళలు, వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, మ్యాచింగ్ గ్రాంట్ పెంపు, ఉచిత ఏసీ కనక్షన్, లాభాల వాటా 16శాతానికి పెంచడం, తెలంగాణ ఇంక్రిమెంట్ ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌కు దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. టీబీజీకేఎస్ కార్యకర్తలు కార్మికులకు అండగా ఉంటూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సత్యం, శ్రీనివాసరెడ్డి, మామెడ తిరుపతి, అనిల్‌రెడ్డి, సురేందర్, కూర తిరుపతి, రవితేజ, హరిప్రసాద్, వెంకటేస్, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి ఏర్పాట్ల పరిశీలన

రామగిరి ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 14న జరిగే రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి ఎస్‌వోటూజీఎం సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అధికారులు రాజేంద్రకుమార్, సుదర్శనం, గుర్రం శ్రీహరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అయ్యప్ప ఆలయం

అదనపు గదుల నిర్మాణం

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంలో అదనపు గదుల నిర్మాణ పనులను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ అయిల రమేష్ తదితరులు ప్రారంభించారు. ఆలయం అభివృద్ధికి సుల్తానాబాద్ కు చెందిన నల్ల సరస్వతి, నల్ల సతీష్ మణి ఆర్థిక సహాయం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శనిగరపు శంకరయ్య, అల్లం భాగ్యలక్ష్మి సత్యనారాయణ, అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి, మాటేటి శ్రీనివాస్, స్వామి, రత్నం, టీకే తిరుపతి, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఉదయకుమార్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణమాచార్య, సమీరా, వెంకటరెడ్డి, భారతి, వినోద పాల్గొన్నారు.